

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం,8 జనవరి 2026 | 8 పేజీలు


# ఓఎన్‌జీసీ బావిలో గ్యాస్ సెగలు...

## 'డీప్ ఇండస్ట్రీస్' కక్కుర్తి ఫలితాలే!





- ఇరుసుమండ 'బ్లో అవుట్' వెనుక కాంట్రాక్ట్ ఏజెన్సీ 'కాసుల' కక్కుర్తి
- ఇది సాంకేతిక లోపం కాదు.. వ్యవస్థీకృత నిర్లక్ష్యం!
- చట్టాలను తుంగలో తొక్కిన ప్రైవేట్ సంస్థ..
- లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం
- మైన్స్ యాక్ట్ ఏం చెబుతోంది? బాధితుల వేదన ఏమిటి?
- సూర్య బ్యూరో లోతైన విశ్లేషణ



**కోనసీమ గడ్డపై ఎగసిపడుతున్న గ్యాస్ సెగలు... సాంకేతిక వైఫల్యం కాదు,ఓ ప్రైవేట్ కాంటాక్ట్ సంస్థ సాగించిన లాభాల వేట మిగిల్చిన చేదు ఫలితం! ఐదు రోజులుగా ముప్పు పొంచి ఉందని సంకేతాలు వస్తున్నా, పెనాల్టీల భయంతో వాస్తవాలను కప్పిపుచ్చి...వేలాదిమంది ప్రజల ప్రాణాలను పణంగా పెట్టిన కాంట్రాక్ట్ ఏజెన్సీ 'డీప్ ఇండస్ట్రీస్ కక్కుర్తిపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో ప్రజా ప్రయోజనార్థం అందిస్తున్న సంచలన కథనం..**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో ఎగసిపడుతున్న గ్యాస్ జ్వాలలు కేవలం భూగర్భ ఒత్తిడి ఫలితం మాత్రమే కాదు.. అవి ప్రైవేట్ కాంట్రాక్ట్ ఏజెన్సీ ఏళ్ల తరబడి సాగిస్తున్న నిర్లక్ష్యపు నిప్పుకణికలు. ఈ ఘటనపై 'జాతీయ తెలుగు దినపత్రిక సూర్య ఇన్వెస్టిగేటివ్ బ్యూరో జరిపిన లోతైన పరిశోధనలో దిగ్భ్రాంతి కలిగించే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. డీప్ ఇండస్ట్రీస్ అనే ప్రైవేట్ ఏజెన్సీ తన లాభార్జనే ధ్యేయంగా భద్రతా ప్రమాణాలను విస్మరించి సాగించిన ప్రయోగం, నేడు కోనసీమ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టింది.

**నిబంధనలు గాలికొదిలేశారు..**

**చట్టం ఏం చెబుతోంది?**

భారత ప్రభుత్వ మైన్స్ యాక్ట్ 1952 మరియు ఆయిల్ మైన్స్

- తరువాయి 2లో..

# ఈ నెల 9వ తేదీ నుండి 11 వరకు సంక్రాంతి సంబరాలు

**-జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్**



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మూడు రోజులపాటు పిఠాపురంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు.సంక్రాంతి సంబరాలను 9వ తేదిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభిస్తారన న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్ మరియు నాదెండ్ల మనోహర్ హాజరుకానున్నారని తెలిపారు. ప్రజలను ఉత్తేజపరచేందుకునిమిత్తంప్రతిరోజు సాయంత్రం గం .05 : 00 ని.లు. నుండి గం .07 : 30 ని.లు. వరకు వివిధ కార్యక్రమములు అనగా మొదటి రోజు వ తేదిన 1. హరిదాసు పాటలు 2. గంగిరెద్దు నాట్యం 3.జానపదగానం 4 వీరనాట్యం 5.ఉరుములు 6. తప్పెటగుళ్ళు 7. గరగలు 8. డప్పు 9. లంబాడీ నృత్యం 10.కొమ్ముకోయ 11. ధింసా 12. కూచిపూడి నృత్యం 13. భరతనాట్యం 14. జానపద గీతాలు 15.కోలాటం ,రెండవ రోజు 1. పిల్లల సాంస్కృతిక కార్యక్రమములు 2. గాత్ర సంగీత కచేరీ, 3. వాయిద్య సంగీత కచేరీ, 4.కాలారియాపట్టు, మూడవ రోజు1. పశువులు మరియు పంట జానపద ప్రదర్శన ) 2. గ్రామ జానపదబృందాలు డప్పు ప్రదర్శన

- తరువాయి 2లో..

# సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే బండారు

**-పలు అంశాలపై విజ్ఞప్తి**

**-సానుకూలంగా స్పందించిన సీఎం**



**కొత్తపేట, మేజర్‌న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బుధవారం సీఎం పేషీలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కలుసుకుని విన్నవించుకున్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న అగ్నికుల క్షత్రియులకు వేట విరామ సమయంలో ఓఎన్జీసీ, గెయిల్,రిలయన్స్ తదితర సంస్థల నుంచి జీవనభృతి అందే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రావులపాలెంలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ మంజూరు, ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి నిధుల మంజూరు చేయాలని కోరారు. దళిత పారిశ్రామిక వేత్తలకు ఎమ్.ఎస్.ఎమ్.ఈల ప్రోత్సాహక రాయితీలు విడుదల చేయవలసిందగా చేయాలని కోరారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం నియోజకవర్గంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను అందజేశారు. ఆయా అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే బండారు తెలిపారు.

# ఓఎన్‌జీసీ బావిలో గ్యాస్ సెగలు..

**మొదటిపేజి తరువాయి**

రెగ్యులేషన్స్ యాక్ట్ 2017 ప్రకారం గ్యాస్ బావుల తవ్వకం వద్ద సదరు కాంట్రాక్ట్ ఏజెన్సీ అత్యున్నత స్థాయి భద్రతా ప్రమాణాలు పాటించాలి. కానీ ఇరుసుమండ వద్ద ఓఎన్జీసి పనులు చేస్తున్న ఈ ప్రైవేట్ సంస్థ వాటిని అక్షరాలా ఉల్లంఘించిందని చెబుతూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**– రెగ్యులేషన్ 72 బిఓపి ప్రాధాన్యత**

బావి తవ్వేటప్పుడు 'బ్లో అవుట్ ప్రివెంటర్' ప్రతి 7 రోజులకు ఒకసారి టెస్ట్ చేయాలి. ఇరుసుమండలో పనులు చేస్తున్న ఏజెన్సీ వద్ద ఈ టెస్టింగ్ పాత రికార్డులు లేవు. పనికిరాని పాత వాల్వ్‌లను వాడటం వల్లే గ్యాస్ 'కిక్' ఇచ్చినప్పుడు అది ఆపలేకపోయిందని సమాచారం.

హెచ్చరికలను బేఖాతరు చేసిన ఏజెన్సీ:

బావిలో ఒత్తిడి పెరిగినప్పుడు 48 గంటల ముందే సూచనలు వచ్చినా.. డీప్ ఇండస్ట్రీస్‌కు ఇది పూర్తిగా తెలిసినా, పని ఆపివేస్తే తమకు పెనాల్టీలు పడతాయనే స్వార్థంతో విషయాన్ని గోప్యంగా ఉంచి డ్రిల్లింగ్ కొనసాగించిందని విశ్వసనీయ సమాచారం.

ఇది ముమ్మాటికీ నేరపూరిత నిర్లక్ష్యం

**ప్రమాద తీవ్రత – క్షేత్రస్థాయి వాస్తవాలు**

– మృత్యు వలయం : గ్యాస్ బావి చుట్టూ 2 కిలోమీటర్ల మేర హై-అలెర్ట్ జోన్‌గా ప్రకటించాల్సి వచ్చింది.

**నిర్వాసితుల గోడు :** వేలాది మంది ఇరుసుమండ గ్రామస్థులు ప్రాణభయంతో గూడు వదిలి రోడ్డున పడ్డారు.

– పర్యావరణ విధ్వంసం : 500 మీటర్ల పరిధిలోని కొబ్బరి తోటలు, పంట పొలాలు ఎగసిపడుతున్న వేడి గాలులకు కాలి బూడిదయ్యాయి. గాలిలో మిథేన్ స్థాయిలు పెరిగి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది.

**ఇన్వెస్టిగేషన్ విశ్లేషణ: కాంట్రాక్ట్ ఏజెన్సీ గుట్టు ఇదే!**

**క్షేత్రస్థాయిలో ఖర్చులు తగ్గించుకోవడానికి డీప్ ఇండస్ట్రీస్ అనుసరిస్తున్న అడ్డదారులు ఇవే:**

**నిపుణులు లేని సిబ్బంది** : నిబంధనల ప్రకారం కనీసం 10 ఏళ్ల అనుభవం ఉన్న డ్రిల్లింగ్ ఇంజనీర్లు ఉండాలి. కానీ కాంట్రాక్ట్ సంస్థ తక్కువ జీతానికి వచ్చే తాత్కాలిక సిబ్బందితో పనులు చేయిస్తోంది. వీరికి అత్యవసర పరిస్థితుల్లో బావిని ఎలా 'కిల్ ది వెల్' చేయాలో కనీస అవగాహన లేదు.

**– పాతబడిన యంత్రాలు** : విదేశాల్లో పనికిరావని పక్కన పెట్టిన పాత రిగ్గులను ఈ ఏజెన్సీ కోనసీమ గడ్డపై వాడుతోంది. వీటి సామర్థ్యం తక్కువ కావడం వల్లే ఇలాంటి బ్లో అవుట్‌లు సంభవిస్తున్నాయి.

**బ్లో అవుట్ అంటే ఏమిటి?**

భూగర్భంలో విపరీతమైన ఒత్తిడి పెరిగినప్పుడు గ్యాస్ ఒక్కసారిగా పైకి తన్నుకురావడాన్ని 'గ్యాస్ కిక్' అంటారు. ఈ సమయంలో పక్కాగా పని చేయాల్సిన 'బ్లో అవుట్ ప్రివెంటర్' వాల్వ్‌లు పాతవి కావడంతో అవి ఒత్తిడిని తట్టుకోలేక విఫలమయ్యాయి. దీనివల్ల గ్యాస్ జ్వాలలు అనియంత్రితంగా ఎగసిపడుతున్నాయి.

**బాధితుల వెర్షన్: కన్నీరు మున్నీరవుతున్న గ్రామస్తులు**

"ఐదు రోజులుగా బావి నుంచి వింత శబ్దాలు వస్తున్నాయి. మేం ఏజెన్సీ మనుషులకు చెబితే 'ఏం కాదులే బాబూ.. అంతా మా కంట్రోల్‌లోనే ఉంది' అని నమ్మబలికారు. తీరా చూస్తే ఇప్పుడు ఊరు ఊరంతా ఖాళీ చేసి రోడ్డున పడ్డాం.మాకొబ్బరి తోటలు మాడిపోతున్నాయి." అని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**డీప్ ఇండస్ట్రీస్ సమాధానం చెప్పాలి!**

ఒకవైపు కఠినమైన పర్యావరణ పరిరక్షణ చట్టాలు ఉన్నా, ఈ ప్రైవేట్ ఏజెన్సీ జనావాసాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా ఎలా వ్యవహరిస్తోంది? ప్రతిగ్యాస్ బావి వద్ద ఉండాల్సిన ఆన్ సైట్ ఎమర్జెన్సీ ప్లాన్ అమలులో కాంట్రాక్టు సంస్థ ఘోరంగా విఫలమైంది.

**మేధావులను వేధిస్తున్న ప్రశ్నలు**

– ఓఎన్జీసి లాంటి ప్రతిష్టాత్మక సంస్థ, డీప్ ఇండస్ట్రీస్ వంటి సంస్థల భద్రతా రికార్డులను ఎందుకు తనిఖీ చేయలేదు?

– ప్రమాదం గురించి 5 రోజుల ముందే సంకేతాలు వచ్చినా జిల్లా యంత్రాంగాన్ని ఎందుకు అప్రమత్తం చేయలేదు?

ప్రజల డిమాండ్ కఠిన చర్యలు తీసుకోవాలి!

**– క్రిమినల్ కేసులు:** నిబంధనలు ఉల్లంఘించిన ఏజెన్సీపై సెక్షన్ 336 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

**– బ్లాక్ లిస్ట్:** ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న డీప్ ఇండస్ట్రీస్ ను వెంటనే బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, లైసెన్సులను రద్దు చేయాలి.

**– భారీ జరిమానా:** నష్టపోయిన రైతులకూ, గ్రామస్తులకూ కాంట్రాక్ట్ సంస్థే పూర్తి బాధ్యత వహించి భారీ పరిహారం చెల్లించాలి.

**ముగింపు :** ప్రైవేట్ కాంట్రాక్ట్ ఏజెన్సీల స్వార్థం వల్ల సామాన్య ప్రజలు బలి పశువులవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఈ సంస్థ అక్రమాలపై జాతీయస్థాయి విచారణ కమిటీతో విచారణ జరిపించాలి. లేకపోతే కోనసీమ మరోభారీ విషాదానికి మిగిలిపోవడం ఖాయం.

# శ్రీనివాస కళ్యాణ మహోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** జంగారెడ్డిగూడెం పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలకు పవిత్ర ధనుర్మాసం పురస్కరించుకొని స్థానిక సూర్య కిరణ్ ఫంక్షన్ హాలు వద్దగల రాములమ్మ చెలక ప్రాంగణంలో జరగబోవు శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.కళ్యాణ మహోత్సవం ఏర్పాట్లను గురించి పట్టణ ప్రముఖులు డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) అధ్యక్షత న కమిటీ సభ్యులు,కూటమి నాయకులు,దేవాదాయల ప్రతినిధులు,కమిటీ నిర్వాహకులు పెద్దలతో సమావేశం జరిగింది. డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం తిరుపతి వారిచే ఈ నెల 9వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సూర్య కిరణ్ ఫంక్షన్ హాల్ ఆవరణలో శ్రీ శ్రీనివాస కళ్యాణం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రూ.10లక్షల వరకు నిర్వహణకుసమకూర్చవలసి ఉందన్నారు. కల్యాణ ఏర్పాట్లను సవివరంగా తెలిపారు. సమావేశంలో పట్టణ ప్రముఖులు కొండ్రెడ్డి కిషోర్,పరిమి సత్తిపండు,రావూరి కృష్ణ,కలగర శ్రీనివాస్,కొప్పాక శ్రీనివాసరావు, పి.వి రామలక్ష్మి,పెనుమర్తి సురేష్ బాబు,మహంకాళి రామ్మోహన రావు,కొనకళ్ళ వెంకటేశ్వరరావు, ఇనగడప వీరాంజనేయులు, కొంబాడ దుర్గాప్రసాద్,పాలపర్తి శ్రీనివాస్,భవిరిశెట్టి మురళీకృష్ణ, రొంగల నాగేశ్వరరావు,మానవత త్రిపురా రమేష్,తదితరులు పలు సూచనలు చేశారు.సమావేశంలో సామాన్య సైతం స్వల్ప రుసుముతో పాల్గొనే అవకాశాన్ని కల్పించారు. కళ్యాణ మహోత్సవానికి టిడిపి దేవస్థానం నుండి వేద పండితులు, కళ్యాణ ఉత్సవ మూర్తులు వస్తున్నారని,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలతో ఆర్ఆర్ కేబుల్స్

**– ఏపీ మేనేజర్ నరేష్**

**అమలాపురం,మేజర్‌న్యూస్ :** ఆర్ఆర్ కేబుల్ ఉత్పత్తులు అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించబడ్డాయని ఏపీ మేనేజర్ ఏ నరేష్ కుమార్ తెలిపారు. బుధవారం నల్లవంతెన వద్ద శ్రీ వెంకట శార్వాని ఎలక్ట్రికల్స్ ఆధ్వర్యంలో స్థానిక ఎలక్ట్రీషియన్స్‌తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ ఆర్ కేబుల్స్ ఏపి మేనేజర్ నరేష్ మాట్లాడుతూ వీటిలో 19 అంతర్జాతీయ ధృవపత్రాలు ఉన్నాయి.



ఈ కేబుల్స్ అగ్ని ప్రమాదాలను తగ్గించడానికి ప్రత్యేకమైన ఫ్లేమ్ రిటార్డెంట్ తక్కువ పొగ, హాలోజెన్ లేని పాలిమర్ సమ్మేళనాలను ఉపయోగిస్తాయి.ఇది మంటలు వ్యాపించడాన్ని తగ్గిస్తుంది, పొగ పీల్చడం వల్ల కలిగే ప్రమాదాలను గణనీయంగా తగ్గిస్తుందన్నారు. తమ కేబుల్స్‌లో అధిక-నాణ్యత కలిగిన, స్వచ్ఛమైన రాగిని ఉపయోగిస్తుందని, ఇది మెరుగైన విద్యుత్ ప్రవాహాన్ని మన్నికను అందిస్తుందన్నారు. ఈ వైర్లు వేడిని తట్టుకునేలా రూపొందించబడ్డాయి, సాధారణ వైర్లు విఫలమయ్యే లేదా తుప్పు పట్టే పరిస్థితులలో కూడా సురక్షతంగా బలంగా ఆర్ఆర్ కేబుల్స్ ఉంటాయి.

ఇవి దీర్ఘకాలం ఉండేలా తయారు చేయబడతాయి, తద్వారా ఇల్లు లేదా భవనానికి సురక్షతమైన, నమ్మదగిన పరిష్కారాన్ని అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ముద్రగెడ సుధాకర్, వర్రే సతీష్, పిల్లా ఇస్సాకు, కిరణ్ కుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 9వ తేదీ నుండి 11 వరకు సంక్రాంతి సంబరాలు

**మొదటిపేజి తరువాయి**

3.గ్రామ జానపదబృందాలు లంబాడీల నృత్య ప్రదర్శన 4. గ్రామ జానపద బృందాలు ఉరుములు నృత్య ప్రదర్శన 5. గ్రామ జానపద బృందాలు కొమ్ముకోయ నృత్య ప్రదర్శన 6. గ్రామ జానపద బృందాలు థింసా నృత్య ప్రదర్శన 7. గ్రాండ్ మ్యూజికల్ నైట్ ( సినిమా పాటలు ) 8. రేలా రేలా రే జానపద సంగీతం మొదలగు కార్యక్రమములు నిర్వహించడం జరుగుతుందన్నారు. 09 వ తేది న 1. జబర్దస్త్ నటులు హైపర్ ఆది 2. మాజీ భారత క్రికెట్ ఆటగాడు అంబటి రాయుడు మరియు 3. నటులు ఆర్.. నాయుడు ( సాగర్ ) అతిథులుగా హాజరౌతారన్నారు. 10వ తేదిన ఎమ్మెల్సీ నాగబాబు మరియు జబర్దస్త్ నటులు సుడిగాలి సుధీర్, గెట్ అప్ శ్రీను, ఆటో రామ్ ప్రసాద్, సప్తగిరి, రైట్ రాఘవ, పృధ్వి, నెల్లూరు నాగరాజు, జబర్దస్త్ పులి, హుస్సేన్ మరియు 2024 ఎలెక్షన్ నిమిత్తము పిఠాపురం లో ప్రచారము చేసిన ఇతర నటీ నటులు అతిధిలుగా హాజరౌతారని తెలిపారు. 11 వ తేదిన డైరెక్టర్ హరీష్ శంకర్, నటులు నవీన్ పోలిశెట్టి, కిరణ్ అబ్బవరం అతిథిలుగా హాజరు కానున్నారన్నారు. కావున ఈ సంక్రాతి సంబరాలలో ప్రజలందరూ పాల్గొని పండగ వాతావరణమును ఆస్వాదించాలని ఆయన కోరారు. వీటితోపాటు18 రకముల పనులకు ఉప- ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవములు చేస్తారని ఇన్ చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు.

# వైభవముగా దేవీ వైభవ ప్రవచనం



**అనపర్తి, మేజర్ న్యూస్ :** సద్గురు త్యాగరాజ స్వామి వారి పుణ్యతిథి, పుష్య బహుళ పంచమిని పురస్కరించుకుని త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం త్యాగరాజ స్వామి వారి పంచరత్నసేవ విద్వాన్ సిహెచ్ శేషగిరిరావు, విద్వాన్ సాంబశివ కోటయ్య బృందం నాదస్వర వాద్య కచేరి అద్భుతంగా చేశారు. ఈ కార్యక్రమానంతరం అవధాన రాజహంస బిరుదాంకితులు బ్రహ్మశ్రీ కోట వెంకట లక్ష్మ నరసింహ చే దేవి వైభవం ఆధ్యాత్మిక ప్రవచనం అద్భుతంగా సాగింది. జగన్మాత యొక్క కరుణ మరియు లీలలను అత్యద్భుతంగా నరసింహ వివరించారు. ఈ కార్యక్రమం శ్రీ వేమూరి వేంకట సుబ్బారావు శ్రీమతి వేంకట రమణమ్మ ఆధ్యాత్మిక ట్రస్ట్ వారి సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీలుఖానా రాఘవ శేష రాధాకృష్ణ రావు, వి.వి. తిలక్ కుమార్, ప్రముఖ న్యాయవాది వి వి ఆర్ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాల ప్రారంభించారు. కార్యక్రమాలనంతరం బ్రహ్మశ్రీ కోట వెంకట లక్ష్మ నరసింహ వారిని, నాదస్వర వాద్య కళాకారుల బృందాన్ని పీలుఖానా రాఘవ శేష రాధాకృష్ణ రావు, వి.వి. తిలక్ కుమార్, ప్రముఖ న్యాయవాది వివి ఆర్ సుబ్రహ్మణ్యం సత్కరించారు. ఈ కార్యక్రమాలకు విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తమలంపూడి చిన ఆదిరెడ్డి, ఉపాధ్యక్షులు మురళీమోహన్, బాలకృష్ణారెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తిని పరామర్శించిన నిమ్మకాయల రంగనాగ్



సామర్లకోట, మేజర్ న్యూస్ : ఇటీవల హుస్సేన్ పురం గ్రామంలో ఆకతాయిల చేతుల్లో గాయపడిన చల్ల దుర్గాప్రసాద్‌ను పెద్దాపురం ఏమ్మెల్యే రాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాథ్( బాబి ) బుధవారం పరామర్శించారు.ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి ఓదార్చారు. ఆయనతోపాటు ముసిరెడ్డి శ్రీరాములు చీకటి వెంకటేష్, హుస్సేన్ పురం గ్రామ టిడిపి ప్రెసిడెంట్ చల్లా బుజ్జి మరియు కూటమి నాయకులు ఉన్నారు.

# ప్రగతిలో పేరెంట్స్‌కు రంగోలి పోటీలు





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** సంక్రాంతి సంబరాలు సందర్భంగా ప్రగతి విద్యాసంస్థల్లో బుధవారం పేరెంట్స్‌కు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ హిమబిందు లాంఛనంగా ప్రారంభించారు. ఈ పోటీలలో పలువురు విద్యార్థులకు చెందిన మదర్స్ పాల్గొని అద్భుతమైన వివిధ రంగులతో ముగ్గులను వేశారు. ఎంతో ఉత్సాహంతో పాల్గొన్న మదర్స్ పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల హర్షన్ని వ్యక్తం చేస్తూ తిరిగి తమ బాల్యాన్ని గుర్తు చేసుకున్నామని పలువురు వ్యాఖ్యానించారు. పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు సందర్భంగా నేటి నుండి ఈ నెల 9వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. సంస్కృతి సంప్రదాయాల పట్ల విద్యార్థుల పేరెంట్స్ కూడా అవగాహనను ప్రదర్శించేందుకు వినూత్న రీతిలో ఈ పోటీలను నిర్వహించడం జరిగిందని చెప్పారు. వీటిని వీక్షస్తున్న విద్యార్థులు కూడా ముగ్గులు పట్ల తమ అభిరుచిని పెంపొందించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందన్న అభిప్రాయంతో పాఠశాల యాజమాన్యం పూర్తి సహాయ సహకారాలతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. గురువారం మధ్యాహ్నం పాఠశాల విద్యార్థులకు ముగ్గులు పోటీ నిర్వహించడం, శుక్రవారం ప్రత్యేక బొమ్మల కొలుపుతో పాటు చిన్నారులకు భోగి పళ్ళు వేసే కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఈసారి భోగి పళ్ళు వేసే కార్యక్రమాన్ని చిన్నారుల గ్రాండ్ పేరెంట్స్ ద్వారా జరపదలిచామని, పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడ సాంస్కృతిక పరిరక్షణ కార్యక్రమా లతోపాటు పర్వదినాల ఉత్సవాలను కూడా నిర్వహించడం ద్వారా మతసామరస్యాన్ని పాటించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ ఎన్.పూర్ణచంద్రరావుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల పేరెంట్స్ పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం

**– జెఎన్టీయుకె, ఏపి పోలీస్ మధ్య ఎంవోయూ**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ (జేఎన్‌టీయూకే) మరియు ఆంధ్రప్రదేశ్ పోలీస్ మధ్య సైబర్ నేరాల నివారణ,దర్యాప్తు మరియు డిజిటల్ పోలీసింగ్ రంగాల్లో పోలీసు సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా కీలకమైన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) ది.07.01.2026 బుధవారం అధికారికంగా కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం, సివిల్ & ఏపీఎస్పీ కానిస్టేబుళ్లకు "సైబర్ క్రైమ్ &డిజిటల్ పోలీసింగ్"లో 9 నెలల సర్టిఫైట్ కోర్సును నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ, ఈ సర్టిఫైట్ కోర్సు పోలీసు సిబ్బందికి సైబర్ క్రైమ్ దర్యాప్తు మరియు ఫోరెన్సిక్స్ రంగాల్లో ఆధునిక నైపుణ్యాలు అందించడం, సైబర్ నేరాలపై అవగాహన పెంచి, కేసుల విచారణలో సమర్థతను మెరుగుపరచడంలో ఉపయోగపడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పీ కార్యాలయం నుండి అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ట్రైనింగ్) మోకా సత్తి బాబు, ఐపీఎస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు, యూనివర్సిటీ డైరెక్టర్లు, ప్రొఫెసర్‌లు పాల్గొన్నారు.



# పారిశుద్ధ్య నిర్మూలనకు కృషి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలనకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు డిఎల్‌డిఓ రాజేశ్వరరావు చెప్పారు. ఆయన బుధవారం ఆత్రేయపురం లొల్ల గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులను పరిస్థితి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. పారిశుధ్య నిర్మూలనలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సంక్రాంతి సంబరాలు దృష్ట్యా ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. ముఖ్యంగా లొల్ల లాకుల వద్ద ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం జరగనున్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఇప్పటికే పంచాయతీరాజ్ సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకోసం ప్రజలు కూడా సహకరించాలన్నారు. తడి పొడి చెత్త వేరువేరుగా ఉంచి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణంరాజు, కార్యదర్శి కృష్ణమాచార్యులు, శివప్రసాద్ గంగోలి తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహాల ఏర్పాటులో వివక్షేల? ఒకరికి చట్టం.. మరొకరికి చుట్టమా?



రావులపాలెం, మేజర్ న్యూస్ : రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు నిబంధనలు గుర్తుచేసిన అధికారులు, శ్రీకృష్ణదేవరాయల విగ్రహం విషయంలో ఎందుకు మౌనం వహించారని వైఎస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్ ప్రశ్నించారు. రావులపాలెంలో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, చట్టం అందరికీ ఒక్కటే కావాలని, ఒక వర్గానికి రూల్స్.. మరో వర్గానికి మినహాయింపులు ఇవ్వడం పక్షపాతమేనని ధ్వజమెత్తారు. చారిత్రక పురుషులను కులాలకు పరిమితం చేస్తూ, అర్ధరాత్రి వేళ విగ్రహాల ఏర్పాటు వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని విమర్శించారు. ఎస్సీలపై అక్రమ కేసులు బనాయించడం మానుకోవాలని, కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డిపై టీడీపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఎస్సీ నాయకులు తీవ్రంగా ఖండించారు.

## ఇద్దరికి జెఎన్టీయుకె 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డులు





**కాకినాడ, మేజర్ న్యూస్ :** నిపుణుల బృందం సిఫార్సు మేరకు అలుగొండ రాజని మరియు యాదవల్లి మురళీ కృష్ణ సమర్పించిన సిద్ధాంత వ్యాసాలు జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందాయి. అలుగొండ రాజని మరియు యాదవల్లి మురళీ కృష్ణలకు ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డులు లభించాయి.

అలుగొండ రాజని సమర్పించిన సిద్ధాంత వ్యాసం 'ఈసీజీడీ–నెట్: డీప్ లెర్నింగ్–బేస్డ్ ఈసీజీ సిగ్నల్ డీనాయిజింగ్ విత్ ఎంఐఈఎండీ ఫిల్టరింగ్ ఫర్ రిలైయబుల్ కార్డియాక్ మానిటరింగ్ యూజింగ్ సిఎన్‌ఎన్ అండ్ ఎంఆర్‌ఎంఆర్'ను కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ఎలక్ట్రానిక్స్ & కమ్యూని కేషన్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డా.కె.సత్య ప్రసాద్ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు. యాదవల్లి మురళీ కృష్ణ సమర్పించిన సిద్ధాంత వ్యాసం 'ఈఈజీ ఆర్టిఫాక్ట్ సోర్స్ సెపరేషన్ మోడల్స్ ఫర్ సింగిల్–చానల్ ఈఈజీ యూజింగ్ సబ్‌స్పేస్ మెథడ్ ఇంటిగ్రేటెడ్ విత్ అన్‌సూపర్వైజ్డ్ లెర్నింగ్ మెథడ్స్'ను కాకినాడలోని జెఎన్‌టి యుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా.పి.వినయ్ కుమార్ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**గోపాలపురం,మేజర్‌న్యూస్ :** గోపాలపురం మండలంలోని పెద్దగూడెంలో బుధవారం పార్ద్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు ఆశ్రమ ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ప్రాంగణంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ పైడి శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆరోగ్యంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. తీసుకొనే ఆహారం, వాతావరణం లో మార్పులు తదితర కారణాలవల్ల ప్రతి ఒక్కరు ఏదో ఒకరోగం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే వైద్యుని సంప్రదించి తగు సూచనలు, సలహాలు పొందాలన్నారు. శిబిరంలో స్త్రీల, చిన్నపిల్లల, ఎముకల విభాగాలకు చెందిన వైద్యులతో పాటు జనరల్, నేత్ర, దంత, ఈఎన్‌టి వైద్యులు పాల్గొన్నారు. రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి వైద్యుల సలహా మేరకు రక్త, బిపి పరీక్షలతో పాటు ఈసీజీ, ఎక్స్ రే, స్కానింగ్ ఒంటి పరీక్షలు సైతం ఉచితంగా చేశారు.

ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ శిబిరం కొనసాగింది. శిబిరానికి వచ్చే రోగులకు త్రాగునీరు వంటి వసతులను నిర్వాహకులు కల్పించారు. శిబిరంలో వైద్యులు 150 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్య బృందం, శిబిరం నిర్వాహకులు భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వైద్య బృందం, సిబ్బంది, దొడ్డిగర్ల వెంకటేశ్వరరావు, చింతలపూడి భాస్కరరావు, ఇంజమూరి సుబ్బారావు, రేవుల గద్ద భాస్కరరావు, ఎం.కొండలరావు, గుమ్మడి నాగేశ్వరరావు, బొంత శ్రీరాములు, దాసరి రామారావు, పాముల తిరుపతయ్య, పైడి దొరబాబు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 'పోలవరం' జిల్లా అభివృద్ధికి సహకరించండి

– ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే శిరీష దేవి వినతి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం రంపచోడవరం నూతన జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి విజ్ఞప్తి చేశారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో ఉన్న గిరిజన ప్రాంతాలను పోలవరం జిల్లాగా ముఖ్యమంత్రి ప్రకటించినందుకు ఎమ్మెల్యే శిరీష దేవి కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం జిల్లా ఏర్పాటు చేసిన శుభ సందర్భంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి కలిసారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులపై సమీక్షకు బుధవారం విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా నూతనంగా పోలవరం రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల నిర్వాసితులైన వారికి పునరావాస ప్యాకేజీపై ఎమ్మెల్యే విన్నవించారు. అలాగే పోలవరం (రంపచోడవరం) నూతన జిల్లా అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

# సుస్థిర ఆస్తుల కల్పనే లక్ష్యంగా 'ఉపాధి' పనులు



– ఐటీడీఏ పిఓ స్మరణ్ రాజ్

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధి పనులు ద్వారా చేపట్టిన పంట సంజీవిని పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో సుస్థిర ఆస్తులు అభివృద్ధి చేసే లక్ష్యంగా ఉపాధి హామీ పనులు జరగాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బచ్చు స్మరణ్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం మండలం బీరంపల్లి, బి.వెలమలకోట, గంగవరం గ్రామంలోని పంట సంజీవిని పనులు ప్రాజెక్ట్ అధికారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామీణ శ్రామికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఏజెన్సీలో ఉపాధి పథకం ద్వారా ప్రారంభించిన పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏ గ్రామంలోనైనా కొత్త పనులకు గ్రామసభలు ద్వారా తీర్మానాలు చేసి నివేదికలు సమర్పించాలన్నారు. నూతనంగా ఏర్పడిన పోలవరం (రంపచోడవరం) జిల్లాలో ఉపాధి హామీ పనులు సమర్ధవంతంగా నిర్వహిస్తే శ్రామికుల సంక్షమంతో పాటు నూతన పోలవరం జిల్లాను ప్రగతి పథంలో నిలపవచ్చునన్నారు. ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరిగితే సంబంధిత సిబ్బంది మీద చర్యలు తప్పవని పిఓ స్మరణ్ రాజ్ హెచ్చరించారు. ఉపాధి పనులు ద్వారా 100 రోజుల నుండి 125 రోజులు పాటు ఉపాధి జాబ్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలన్నారు.

ప్రాజెక్ట్ అధికారి వెంట ఎన్ఆర్ఈజీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, మండల పరిషత్ అధ్యక్షులు పల్లాల కృష్ణారెడ్డి, ఎంపీడీవో లక్ష్మణ్, ఏపీవోలు సురేష్, ప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# శానిటరీ ప్యాడ్స్ అందజేత




**అల్లవరం, మేజర్ న్యూస్ :** సిఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమలాపురం ఆర్‌బివో ప్రాంతీయ మేనేజర్ అశోక్ నాగరాజన్ ఆధ్వర్యములో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురు కుల గోడి బాలికలు హాస్టల్ నందు ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యా యులు సమక్షమున శానిటరీ ప్యాడ్‌లు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమములో ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్లు, కొమర గిరిపట్నం, అల్లవరం వారు ఎం.రవి, ఎం.శ్రీకాంత్,హెచ్.ఆర్. మేనేజర్ కె.వి.సత్యనారాయణ, మొగళ్లమూరు సిఎస్ఆర్ గంటా వి.వి.ఎస్. నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలు అం దరు మంచిగా చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని వారి అభివృద్ధికి ఎస్.బి.ఐ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలియజేసారు.

## జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు

– నిత్యాన్నదాన పథకానికి విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతు న్నాయి. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మేలుకొలుపు, గోదావరి నది జలాల సేకరణ అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాలను తిలకించి తీర్థప్రసాదాలు సేకరించారు.నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నంకు చెందిన దిరిశిన వేంకట శివరామ్, అనురాధ దంపతులు రూ.10,116లు విరాళంగా అందించారు. వీరికి అర్చకులు శేష వస్త్రములతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. దాతలకు ఈవో భాగవతుల వెంకట రమణమూర్తి స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

## సమన్వయంతో పనిచేసి సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** అధికారులంతా సమన్వయంతో పనిచేసి సంక్రాంతి సంబరాలు విజయవంతం చేయాలని ఎంపీడీవో బి.కే.ఎస్.ఎస్. వెంకట్ రామన్ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సంక్రాంతి సంబరాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల సందర్భంగా పంచాయితీ కార్యదర్శులు తమకు కేటాయించిన ప్రదేశాలలో ఎటువంటి వ్యర్థాలు లేకుండా ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపట్టి ఎప్పటికప్పుడు శుభ్రత పాటించవ లసినదిగా ఆదేశాలు జారీ చేశారు. అలాగే వివిధ శాఖల అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన విధులను సమన్వయంతో సక్రమంగా నిర్వహించి సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ రామకృష్ణంరాజు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


# అంబేద్కర్ కోనసీమ గడ్డపై 'సుభాష్' క్రాంతి..
# అమలాపురం అభివృద్ధికి 'సెలక్షన్' గ్యారంటీ!







- నాడు 'రామచంద్రపురం' రక్షకుడు..
- నేడు 'అమలాపురం' భాగ్యవిధాత
- మంత్రి వాసంశెట్టి సుభాష్ చారిత్రాత్మక విజయం
- యువ నేత లోకేష్ స్ఫూర్తితో పట్టణ ప్రగతి.. ఎమ్మెల్యే ఐతాబత్తుల ఆనందరావు హర్షం..- సంబరాల్లో ప్రజలు



**అమలాపురం నుంచి ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**కోనసీమ రాజకీయ యవనికపై మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన అభివృద్ధి మార్క్‌ను చాటుకున్నారు. మాట ఇస్తే మడమ తిప్పని నాయకుడిగా, పట్టుబట్టిన పనిని సాధించే 'టాస్క్ మాస్టర్'గా ఆయన మరో చారిత్రాత్మక విజయాన్ని అమలాపురం ప్రజలకు కానుకగా ఇచ్చారు. అమలాపురం మున్సిపాలిటీని 'సెలక్షన్ గ్రేడ్' స్థాయికి పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు (జీవో నెం. 2) పట్టణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం. ఈ ప్రక్రియలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి, యువ నాయకుడు నారా లోకేష్ అందించిన సహకారం, మార్గదర్శకత్వం మరువలేనివి.

**ఆనాడు డివిజన్ కోసం.. ఈనాడు అప్‌గ్రేడేషన్ కోసం!**

**మంత్రి వాసంశెట్టి సుభాష్ రాజకీయ ప్రస్థానంలో అభివృద్ధికి ప్రాధాన్యత ఎక్కువ.**

**రామచంద్రపురం రక్షకుడు :** గతంలో జిల్లా విభజన సమయంలో రామచంద్రపురం డివిజన్ ఉనికి కోల్పోయే పరిస్థితి వస్తే, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, పోరాడి ఆ డివిజన్‌ను నిలబెట్టిన ఘనత సుభాష్ గారిది. ఆనాడు ఆయన చూపిన చొరవను ఆ ప్రాంత ప్రజలు నేటికీ మరువలేరు.

**అమలాపురం భాగ్యవిధాత :** ఇప్పుడు జిల్లా కేంద్రమైన అమలాపురంపై తన దృష్టి సారించారు. కేవలం పేరుకే జిల్లా కేంద్రం కాకుండా, నిధుల నిలయంగా మార్చాలనే సంకల్పంతో 'సెలక్షన్ గ్రేడ్' హెూదాను సాధించి పెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నేత నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వద్ద పట్టుబట్టి, అమలాపురం అభివృద్ధికి అడ్డుగా ఉన్న నిధుల కొరతను శాశ్వతంగా తొలగించారు.

**లోకేష్ ఆశయాలకు అనుగుణంగా పట్టణాభివృద్ధి : ఎమ్మెల్యే ఐతాబత్తుల ఆనందరావు**

అమలాపురం అభివృద్ధి విషయంలో మంత్రి సుభాష్‌తో కలిసి అడుగులు వేస్తున్న స్థానిక ఎమ్మెల్యే ఐతాబత్తుల ఆనందరావు ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ "ఇది అమలాపురం ప్రజల గెలుపు. మన యువ నాయకుడు నారా లోకేష్ అద్భుతమైన విజన్, మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో ఈ ప్రతిపాదన అత్యంత వేగంగా ఆమోదం పొందింది. సెలక్షన్ గ్రేడ్ హెూదాతో భారీగా నిధులు వస్తాయి. అధునాతన డ్రైనేజీ వ్యవస్థ, నిరంతర తాగునీరు, స్మార్ట్ సిటీ తరహా మౌలిక వసతులు ఇకపై అమలాపురం సొంతం. కూటమి ప్రభుత్వం అమలాపురాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతుంది."

సెలక్షన్ గ్రేడ్‌తో కలిగే మహర్దశ ఇవే:

**- నిధుల వెల్లువ : కేంద్ర, రాష్ట్ర గ్రాంట్లు ఇప్పుడు డబుల్ డిజిట్ స్థాయిలో అందుతాయి.**

- అద్భుత మౌలిక వసతులు : అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 24 గంటల వాటర్ సప్లై ప్రాజెక్టులకు నిధుల అడ్డంకి తొలగిపోయింది.
- పాలనా సంస్కరణలు : అదనపు అధికారులు, ఇంజనీర్ల నియామకంతో పౌర సేవలు మరింత వేగవంతం.
- జిల్లా కేంద్రానికి కళ : బ్రాండెడ్ షోరూమ్‌లు, మాల్స్, ఐటీ సంస్థల రాకకు ఈ హెూదా ఒక ఃగ్రీన్ సిగ్నల్ః.

**అభినందనల వెల్లువ.. 'సుభాష్ - ఆనందరావు' జోడీపై ప్రశంసలు!**

అమలాపురం మున్సిపాలిటీ స్థాయి పెరగడంపై పట్టణ ప్రజలు పండుగ చేసుకుంటున్నారు. జిల్లా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే రామచంద్రపురం డివిజన్ సెంటిమెంట్‌ను గౌరవించి, ఇప్పుడు అమలాపురం భవిష్యత్తును మార్చిన మంత్రి సుభాష్‌ను ప్రజలు వేనోళ్ల కొనియాడుతున్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకుంటూ, బాణాసంచా కాలుస్తూ హర్షం వ్యక్తం చేశారు. పట్టణాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, మంత్రి సుభాష్ మరియు ఎమ్మెల్యే ఆనందరావులకు ప్రజలు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

## నేటి నుండి కిట్స్‌లో సంక్రాంతి సంబరాలు

- కిట్స్ ఛైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, దివిలి-తిరుపతి గ్రామాలలో గల కిట్స్ (కిట్స్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్) ఇంజనీరింగ్ కళాశాల నందు ఈ నెల 8, 9 తేదిలలో ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు కిట్స్ విద్యార్థులచే సంక్రాంతి సంబరాలు (ట్రేడిషనల్ డే) సంప్రదాయ - సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించబడునని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా మొదటి రోజు రంగోలి, ఫుడ్ కాంపిటేషన్, పూరే గుడిస, గాలిపటాల తయారి, బొమ్మల కొలువు, కొలాటం, థగ్స్ ఆఫ్ వార్, కల్చరల్స్, రెండవ రోజు భోగి మంట, హరిదాసు, ఫ్యాషన్ షో, మిస్టర్ & మిస్ కిట్స్, మిస్టర్ పర్‌ఫెక్ట్, కల్చరల్ ఈవెంట్లు, అనంతరం బహుమతి ప్రధానం నిర్వహించబడునని, మన సాంప్రదాయం - మన సంబరం అనే నినాదంతో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సంబరాలలో కిట్స్ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొననున్నట్లు తెలిపారు.

## మరిడమ్మ అమ్మవార్కి పంచామృతాభిషేకం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు బుధవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవార్కి మండపంలో జన్మ నక్షత్రం మఖ నక్షత్రం సందర్భంగా పంచామృతాభిషేకం, పసుపు, కుంకుమ, చందనం, విభూదిలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించి, అనంతరం స్వర్ణ, రజతాలతో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీ అమ్మవారి పారాయణం చేసిన మహిళా భక్తులకు, ఇతర భక్తులకు దేవస్థాన ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్ కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## పదిమంది జూదగాళ్లపై బైండోవర్ కేసు నమోదు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** గతంలో కోడిపందాలు, చిత్తులాట, పేకాటలో పట్టుబడిన పదిమంది జూదగాళ్లపై బైండోవర్ కేసు నమోదు చేసి స్థానిక తహసీల్దారు ఎదుట హాజరపరిచినట్లు ఎస్సై శివకుమార్ మీడియాకు తెలిపారు. బిఎన్ఎస్ఎస్ 126 ప్రకారం, రానున్న సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎవరూ కూడా కోడి పందేలు, పేకాట వంటి జూద క్రీడల్లో పాల్గొనకుండా ఉండాలని, అటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై శివకుమార్ కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# బోడసకుర్రులో ఉచిత వైద్య మెగా క్యాంప్

- సాయి విశ్వాస్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు



**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామంలో సాయి విశ్వాస్ హాస్పిటల్ సౌజన్యంతో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాయి విశ్వాస్ హాస్పిటల్ అధినేత డాక్టర్ గంధం విశ్వనాథ్ హాజరై గ్రామస్తులకు ఉచిత వైద్య చికిత్స నిర్వహించి గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యం కోసం వచ్చిన ప్రతి ఒక్కరికి ఆరోగ్య సలహాలు ఏ విధంగా ఉండాలి, ఎలా ఉండాలి, ఇప్పుడు వచ్చే రోగాల విషయంలో ఏమేమి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్పొరేట్ హాస్పిటల్లో కొంతమంది డాక్టర్లు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అనేకమంది ప్రజలకు సేవ చేయడంలో తోడ్పడుతున్నారని, అదేవిధంగా మా హాస్పిటల్ తరఫున మా సిబ్బంది మా డాక్టర్లు ఈ గ్రామంలో ఉచిత వైద్య మెగా క్యాంప్ ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని.... సర్పంచ్ విజయలక్ష్మికి, ఎంపీటీసీ దొమ్మేటి శ్రీశాంతి భవానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమాని, డాక్టర్ నవీన్ దత్తనాయక్, డాక్టర్ అసద్, డాక్టర్ పి.అనుదీప్, హాస్పటల్ సిబ్బంది పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి మాట్లాడుతూ మా గ్రామానికి విచ్చేసి ఉచిత వైద్య సేవలు నిర్వహించిన డాక్టర్ గంధం విశ్వనాథ్‌కు, హాస్పటల్ సిబ్బందికి, విచ్చేసిన పెద్దలకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రొక్కాల నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, తెలుగుదేశం గ్రామ కమిటీ అధ్యక్షులు అరవ చంటి, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ల శ్రీను, దొమ్మేటి శ్యాంబాబు, ఇళ్ల శేషారావు, ముత్యాలు బాబి, చింతం శ్రీను, ముత్యాల దుర్గారావు, ఓలేటి పరమేశ్వరరావు, అయిల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి చిక్కం శ్రీనివాసరావు, దొమ్మేటి రాధాకృష్ణ, సొసైటీ డైరెక్టర్ మొయిల గణపతి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యాధికారులు సేవలు వినియోగించుకోవాలి

**– ఎంపీపీ గోము వెంకటలక్ష్మీ**





**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పిహెచ్సిలో వైద్యాధికారులు సేవలు వినియోగించుకోవలే తప్ప వారిపై దురుసుగా ప్రవర్తించరాదని ఎంపీపీ గోము వెంకటలక్ష్మీ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాజవొమ్మంగి మండల పరిషత్ సమావేశపు హాలు నందు ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొందరు సభ్యులు వైద్యాధికారులను గౌరవం లేకుండా మాట్లాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని విధి నిర్వహణలో ఎక్కడనుండో ఇక్కడికి వచ్చి మన ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న తరుణంలో సంయమనం పాటించి వైద్యులు సేవలు వినియోగించుకోవాలని ఎంపీపీ వెంకటలక్ష్మీ సూచించారు. సెక్టార్ పరిధిలో 14 మినీ అంగన్వాడి కేంద్రాలను మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా అప్గ్రేడ్ చేసినట్లు సిడిపిఓ సుజాత తెలిపారు. బోనంగిపాలెంలో అంగన్వాడి కేంద్రం లేక పిల్లలు అవస్థలు పడుతున్నారని అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టిలో పెట్టినట్లు స్థానిక సర్పంచ్ సవిరాల చంద్రుడు అన్నారు. అలానే దోనెల పాలెం అంగన్వాడీ కేంద్రం పెచ్చులు ఊడిపోతూ శిథిలావస్థితిలోకి వచ్చిందని నూతన భవన ఏర్పాటు చేయాలని ఆయన సిడిపిఓని కోరారు. జడ్డంగి, రేవటపాలెంలో అంగన్వాడి భవనాలు పాడైనట్లు జడ్పిటిసి జ్యోతి, సర్పంచ్ కొంగర మురళీకృష్ణ వివరించారు. ఖరీఫ్ సీజన్లో 5173 హెక్టార్లో పంట సాగుకు1020 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందజేసినట్లు ఏవో చక్రధర్ తెలిపారు. అలానే రబీ సీజన్లో 175 మెట్లు టన్నుల యూరియా ప్రైవేటు డీలర్లు, సొసైటీల వద్ద సిద్ధంగా ఉంచామని ఇప్పటికే40 హెక్టార్లలో వరి, 60 హెక్టార్లో టొబాకో, 70 హెక్టర్లో నల్ల మినుము పంటలు వేసినట్లు ఏవో తెలిపారు. ఇకనుండి యూరియా సప్లై చేయాలంటే ఈ క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. మండలంలో 9831 ఫార్మర్లు ఉండగా ఇప్పటికే 4340 ఐడి జనరేషన్ చేసినట్లు మిగిలిన వారు త్వరితగతిన ఆధార్, పాస్బుక్కు తెచ్చుకొని రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాల న్నారు. 2025లో 5495 మందికి అన్నదాత సుఖీభవ ద్వారా రెండు కోట్ల 7 లక్షల 75000 అందజేసినట్లు చక్రధర్ తెలిపారు. ఇప్పటివరకు ఆర్ ఎస్ కే ద్వారా 3150 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుండి కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ అయిన 24 గంటల్లోపు రైతు ఖాతాలో ధాన్యం సొమ్ములు జమ చేయడం జరుగుతుందన్నారు. మండల పరిషత్ కి వచ్చే బడ్జెట్ లెక్కలు చెప్పడం లేదని దూసరపాము ఎంపిటిసి నల్లా సత్తిబాబు ఆరోపించి సభ నుండి బయటకు వాక్ అవుట్ చేశారు. అలానే సొసైటీ ప్రెసిడెంట్ ను గతంలో స్టేట్ మీదకు పిలిచి కూర్చోబెట్టేవారిని ఇప్పుడు ఎందుకు రూలు మారిందని పిలవడం లేదని సొసైటీ ప్రెసిడెంట్ ముప్పన కేశవ్ ఆరోపించి సభ నుండి వాకౌట్ చేశారు. ప్రతి మండలంలో నామినేటెడ్ పదవులు పొందిన వారిని స్టేజి మీదకు పిలవడం జరుగుతుందని ఇక్కడ ఎందుకు పిలవడం లేదని మార్కెట్ కమిటీ చైర్మన్ లోత లక్ష్మణరావు ఆరోపించి సభ నుండి బయటికి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జూర్రా రాజేశ్వరి, ఆవుగడ్డ నిర్మల కుమారి, కానెం అచ్చియమ్మ, సుంద్రు లోవలక్ష్మీ, కొంగర మురళీకృష్ణ, జగన్నాథం, సూరిబాబు, ఆగూరి సుబ్బలక్ష్మీ, మిర్యాల ధనలక్ష్మీ, తొంట ఆదిరాజు, ఎంఈఓ సత్యనారాయణ దొర, సూరయ్య రెడ్డి, జిసిసిమేనేజర్ గౌరమ్మ, ఏపిఎం రామాంజనేయులు, వైద్యాధికారులు సుష్మ, పావని, అడపా శ్రీకాంత్, శ్రీను, చిన్నబ్బాయి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

# ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** పంటలకు పోషక అవసరాలు తీర్చడంలో నానో యూరియా, డి.ఏ.పీ ఎరువులు ఎంతగానో సహాయపడుతుందని మండల వ్యవసాయాధికారిణి డి.ద్వారకా దేవి సూచించారు. మండల పరిధిలోని గంటి గ్రామంలో ఆత్మ సౌజన్యంతో నానో యూరియా మరియు డి.ఎ.పి వినియోగంపై బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అర లీటర్ నానో ఒక బస్తా యూరియాకి సమానంగా పనిచేస్తుందని సూచించారు. అన్ని పంటలలో పిచికారి చేసుకుంటే మంచి దిగుబడి వస్తుందని తెలియజేసారు. అలాగే ఉద్యాన పంటలు అరటి,కోకో సాగులో ఆధునిక పద్ధతులు, మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట బ్లాక్ ఆత్మచైర్మన్ జక్కంపూడి బాలాజీ,రావులపాలెం ఆత్మ కమిటి డైరెక్టర్ శ్రీ పసుపులేటి రాధాకృష్ణ,గ్రామ సర్పంచ్ సాగి బంగార్రాజు,సొసైటీ చైర్మన్ చీకరమిల్లి లవరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎమ్.నిహారిక, గ్రామ నాయకులు,పెద్దలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో మహిళ మృతి

**– ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలో ఉన్న ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మహిళ మృతి చెందిందని మృతురాలి బంధువులు మంగళవారం సాయంత్రం ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. బాధిత మహిళ బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన మేరుగ రత్నం (57) అనే మహిళకు గుండెకు సంబంధించిన బలహీనత రావడంతో ఈనెల రెండవ తేదీన మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స నిర్వహించేందుకు గాను మహిళ కుటుంబం నిరుపేద కుటుంబం అయినప్పటికీ ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింప చేయకుండా రోగి బంధువుల వద్ద నుంచి లక్ష రూపాయలు పైబడి సొమ్ములు వసూలు చేసి రత్నంకు ఒక స్టంట్ను వేసినట్టు బంధువులు తెలిపారు. తదుపరి ఆమెను వార్డులోనికి మార్పు చేయగా నాలుగు గంటల్లోనే మహిళ మృతి చెందింది. ఆసుపత్రి యాజమాన్యం ఆమె మృతి చెందిన విషయాన్ని గోప్యంగా ఉంచి బంధువుల నుంచి వైద్య ఖర్చులు వసూలు చేసినట్టు వారి ఆరోపించారు. తదుపరి విషయం తెలిసి మృతురాలి బంధువులు ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేయగా వైద్యానికైన ఖర్చులు తిరిగి చెల్లిస్తామని, అల్లరి చేయకుండా మృతదేహాన్ని తీసుకెళితే తదుపరి మాట్లాడుకోవచ్చునని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడంతో మృతదేహాన్ని తీసుకువెళ్లి అంతిమక్రియలను చేపట్టినట్టు చెప్పారు. తదుపరి ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా మాకు ఎలాంటి సంబంధం లేదు, ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ ఎంతో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్టు బంధువులు ఆరోపించారు. దానితో మృతురాలి బంధువులు మంగళవారం సాయంత్రం మరోసారి ఆసుపత్రికి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ విషయంలో మృతురాలి బంధువులు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మను సహాయం కోరగా ఆయన బంధువులకు హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యంపై బుధవారం ఆసుపత్రి వద్ద భారీ స్థాయిలో ధర్నా నిరసన కార్యక్రమం చేపట్టారు.

## టెన్త్ ఎగ్జామ్‌లో పూర్తిస్థాయి ఉత్తీర్ణత సాధించాలి

**– విద్యార్థులకు వందరోజుల ప్రణాళికపై ఆరా తీసిన ఆర్డీవో శ్రీకర్**



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** రాబోయే టెన్త్ ఎగ్జామ్‌లో పూర్తిస్థాయి ఉత్తీర్ణత సాధించాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల విద్యాశాఖ అధికారులకు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు అధ్యక్షతన స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. గత సంవత్సరంలో పదవ తరగతిలో తక్కువ ఉతీర్ణత వచ్చిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కారణాలను అడిగి తెలుసుకొని సూచనలను అందజేశారు. అలాగే పదవ తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళికను అమలు చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తదుపరి విద్యాశాఖకు సంబందించిన అన్ని విషయాలలో కొత్తపేట డివిజన్ మొదటి స్థానంలో ఉండాలని ఆర్డీవో సూచించారు. ఈ కార్యక్రమములో కొత్తపేట తహశీల్దార్ వై.రాంబాబు, డివిజన్ పరిధిలో విద్యాశాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పట్టణం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్‌ను డ్వామా పీడి అడపా వెంకటలక్ష్మీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఉపాధి హామీ కూలీల సమస్యల పై నిరంతరం పోరాడుతున్న సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అని, కూలీల సమస్యల పై పోరాడే సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించడం ఆనందదాయ కమన్నారు. భవిష్యత్తులో కూలీల తరపున మరింత నిలబడాలని ఆకాంక్షంచారు. క్యాలెండర్ ఆవిష్కరించిన వారిలో ఎండిఓలు సతీష్, స్వప్న, ఏపీఎం నాయుడు, గంగాభవాని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి ఈశ్వరరావు, కే ఎస్ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కూరకుల సింహాచలం, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నవరప్పాడు వెంకన్న ఆలయ హుండీ లెక్కింపు



**పెరవలి, మేజర్ న్యూస్ :** అన్నవర ప్పాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయములో జనవరి 7వ తేదీ బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశముల మేరకు ఎంవి రామయ్య కార్యనిర్వహణాధికారి వారి పర్యవేక్షణలో స్వామివారి హుండీలు లెక్కించగా 40 రోజులకు గాను ప్రధాన హుండీల ద్వారా రూ 458472 లు మరియు అన్నదానం హుండీ ద్వారా రూ 11,761 లు పెరసి రూ 4,70,233 లు ఆదాయం సమకూరింది. వెండి బంగారము మరియు విదేశీ కరెన్సీ ఏమి వచ్చి ఉండలేదు అని ఆలయ కార్య నిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మేజర్ న్యూస్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరప్పాడు దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, శ్రీవారిసేవకులు, గ్రామస్తులు, భక్తులు ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారని ఈవో మీసాల రాధాకృష్ణ తెలియజేశారు.


# పిఠాపురం వేదికగా 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు'

**- 9వ తేదీ నుండి 11 వరకు జరగనున్న సంక్రాంతి సంబరాలు**
**- సంక్రాంతి మహోత్సవాలకు హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**
**- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్న ఉప ముఖ్యమంత్రి**




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మూడు రోజుల పాటు పిఠాపురంలో పర్యటించనున్నారు. గురువారం రాత్రికి పిఠాపురం చేరుకోనున్న పవన్ కళ్యాణ్ శుక్రవారం ఉదయం పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం పేరిట నిర్వహించనున్న ముందస్తు సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారు. ఉదయం గం.10.30ని.కి ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. కళాశాల మైదానానికి చేరుకుని సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తారు. ఉదయం గం.11.30 నిమిషాలకు నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. అనంతరం సంక్రాంతి మహోత్సవంలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాళ్లను తిలకిస్తారు. సాయంత్రం పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల ముంపునకు గురైన ఇందిరానగర్ కాలనీ, రైల్వే స్టేషన్ సమీపంలోని మోహన్ నగర్ లను సందర్శిస్తారు. శనివారం ఉదయం గొల్లప్రోలు ప్రాంతంలోని ఇళ్ళ స్థలాలను పరిశీలిస్తారు. అక్కడి నుంచి ఉదయం గం. 10. 30 నిమిషాలకు కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుని శాంతి భద్రతలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గం.కి కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలకు చేరుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు.రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సంక్రాంతి మహోత్సవాలు పిఠాపురం వేదికగా మూడు రోజులపాటు నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలు ఆద్యంతం తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. మొదటి రోజు హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, జానపదగీతాలాపనలు, వీర నాట్యాలు, ఉరుముల నృత్యాలు, తప్పెట గుళ్ళు, గరగు నృత్యాలు, లంబాడ నృత్యం, డప్పులు, గిరిజన సంప్రదాయ నృత్యరీతి అయిన థింసా, అలాగే కూచిపూడి, భరతనాట్యం తదితర శాస్త్రీయ నాట్య ప్రదర్శనలు, కోలాటాలు ఏర్పాటు చేశారు. రెండో రోజు జనవరి 10 తేదీన మొదటి రోజు ప్రదర్శనలతోపాటు కేరళ సంప్రదాయ మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శనలు ఉంటాయి. చివరి రోజు గ్రామీణ జానపదుల పాటలు, సినీ మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు ఆహుతులను అలరించనున్నాయి.

# అదుపుతప్పి లారీ బోల్తా...



**- గాయాలతో బయటపడ్డ డ్రైవర్, క్లీనర్**

**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ అడ్డతీగల మండలంలోని కొట్టంపాలెం గ్రామ సమీపంలో బుధవారం క్వారీ లారీ అతివేగం కారణంగా అదుపుతప్పి బోల్తా కొట్టింది. చెరుకుంపాలెం గ్రామం నుండి అడ్డతీగల వైపు మెటల్ లోడుతో వస్తున్న లారీ కొట్టం పాలెం సచివాలయ సమీపంలోకి రాగానే అతివేగం కారణంగా బోల్తా పడిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు.

ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోయినా లారీ డ్రైవర్ మరియు క్లీనర్ తీవ్ర గాయాలతో బయటపడ్డారు. వీరిని స్థానికులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా దీనిపై కేసు నమోదు చేసి అడ్డతీగల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# తూరంగిలో గ్రామ ఆరోగ్య కేంద్రాలకు ఎమ్మెల్యే పంతం నానాజీ శంకుస్థాపన



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య విప్లవానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, గ్రామీణ ప్రజల చెంతకే వైద్య సదుపాయాలను తీసుకెళ్లేందుకు భారీగా నిధులను కేటాయిస్తోందని ఆయన కొనియాడారు. కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామంలోని సూర్య నగర్ సచివాలయం పరిధిలో, గోపికృష్ణ కాలనీ మరియు బుల్లబ్బాయి రెడ్డి నగర్‌లలో నూతన గ్రామ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి ఎమ్మెల్యే పంతం నానాజీ భూమిపూజ చేయడం జరిగింది. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఒక్కో కేంద్రానికి రూ.36 లక్షల చొప్పున వెచ్చించి ఈ భవనాలను నిర్మించనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ, నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, ఈ కేంద్రాలు అందుబాటులోకి వస్తే స్థానికులకు తక్షణ వైద్య సాయం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేస్తూ రూరల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం సూర్య నగర్ సచివాలయంలో రైతులకు రాజముద్రతో కూడిన 391 కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రైతుల ఆత్మగౌరవాన్ని కాపాడేలా, వారి భూములకు పూర్తి భరోసా కల్పించేలా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైతులకు పారదర్శకంగా భూ హక్కులు కల్పించడం ఆనందదాయకమని, ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా యంత్రాంగం కృషి చేస్తోందని వివరించారు. కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నాయకులు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో తూరంగి ప్రత్యేక అధికారి ఎమ్మెస్సార్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ఎస్.నాగఫణి బాబు, గ్రేడ్ 5 కార్యదర్శులు రణదేవ్, తేజస్వి, సుష్మ, షేక్ రిజ్వి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వీరబాబు, వసంత లక్ష్మి, రోజా, దేవి, రీసర్వే డిటీ కాకర్ల సురేష్, ఆర్ఐ మేడిశెట్టి భవాని, వీఆర్వో కె.శ్రీనివాస్, డీఈ బి.సత్య శ్రీనివాస్ మరియు ఇంజనీరింగ్ సిబ్బంది, డాక్టర్ వసుంధర దేవి, ఏఎన్ ఎండీ. మేరీ రత్నం, ఎంఎల్‌హెచ్‌పి ఐ.పావని, జనసేన మాజీ ఎంపీటీసీలు పితాని వెంకట రాము, వాసంశెట్టి త్రిమూర్తులు, జనసేన గ్రామ కమిటీ ప్రెసిడెంట్ పితాని తేజ, తెలుగుదేశం గ్రామ కమిటీ ప్రెసిడెంట్ జక్కి అప్పన్న, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాల బాధితులతో కలిసి పవన్ కళ్యాణ్‌ను కలుస్తాం

**- అవకాశం ఇవ్వకపోతే సంక్రాంతి సంబరాల్లో పవన్ కళ్యాణ్‌ను అడ్డుకుంటాం**
**- సిపిఐ నాయకులు సాకా రామకృష్ణ**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఇండ్ల స్థలాల బాధితులతో పవన్ కళ్యాణ్ కలుస్తామని, అనుమతి ఇవ్వని పక్షంలో సంక్రాంతి సంబరాల్లో పవన్ కళ్యాణ్ ను అడ్డుకుంటామని పిఠాపురం సిపిఐ నాయకులు సాకా రామకృష్ణ అన్నారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం మరిచిపోయిన ఎమ్మెల్యే ను కలిసి గుర్తు చేయడానికి... అధికారులను అనుమతి కోరితే... రెవెన్యూ అధికారులు, పోలీసు వారు మాకు సంబంధంలేదంటే మాకు సంబంధంలేదని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అత్తవారింటికి కొత్త అల్లుడు సంక్రాంతికి వచ్చివెళ్ళినట్టు నియోజకవర్గానికి వచ్చి వెళుతున్నారని, ప్రజా సమస్యలు చెప్పుకోడానికి అవకాశం కల్పించకపోవడం చాలా దౌర్భాగ్యమని, ఇండ్ల స్థలాల బాదితులు కలిసి తమ బాధలు చెప్పుకోడానికి అవకాశం ఇవ్వని ఎమ్మెల్యే మాకు ఎందుకని మండిపడ్డారు. సెలబ్రిటీ అయితే మా నియోజవర్గంలో ఎందుకు పోటీచేసారని ప్రశ్నించారు. సంక్రాంతి సంబరాల్లో ఖచ్చితంగా అడ్డుకుంటామని పత్రిక ప్రకటన ద్వారా హెచ్చరించారు.

# జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఖండవల్లి గ్రామ పరిధిలో రవళి స్పిన్నర్స్ సమీపంలో జనవరి 7వ తేదీ బుధవారం రాత్రి రావులపాలెం నుండి హైదరాబాదు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్టుని ఢీకొని రోడ్డు పక్కన ఉన్న పంటబోదే లోకి దూసుకు వెళ్ళింది. ఈ ఘటనలో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. ప్రాణనష్టం ఏమీ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పెరవలి పోలీస్ వారు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్ పరిశీలన



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం 1వ తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ గ్యారెంటీ ఫ్లూయన్స్ లిటర్స్ అండ్ న్యూమరసి 75 డేస్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం సామర్లకోటలోని బి.వి.ఆర్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూలును విజిట్ చేయడం జరిగింది. పాఠశాల యందు విద్యార్థుల యొక్క రీడింగ్ మరియు రైటింగ్ ఎబిలిటీని పరిశీలించడం జరిగింది. ఎఫ్ ఎల్ ఎన్ ప్రోగ్రామ్ లో భాగంగా విద్యార్థులను వారి రీడింగ్ ఎబిలిటీ ను బట్టి మూడు రకములుగా అనగా స్ట్రీమ్ , మౌంటైన్, స్కై లు గా గుర్తించి అందరు విద్యార్థులు ను స్కై లోని కి వచ్చేవిధంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఈ ప్రక్రియను పరిశీలించడానికి మండల విద్యాశాఖాధికారి పి .పుల్లయ్య పాఠశాలను విజిట్ చేయడం జరిగినది. మండల విద్యాశాఖాధికారి పుల్లయ్యతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి పాల్గొనడం జరిగినది. 100 డేస్ ప్రోగ్రాంలో భాగంగా మండలం విద్య శాఖధికారి పి పుల్లయ్య బుధవారం బిబిఆర్ హై స్కూల్‌ను కూడా విజిట్ చేయడం జరిగినది. హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు లలితాంబ పాల్గొనడం జరిగినది.

# భారత ఆధ్యాత్మికతకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన యుగపురుషుడు స్వామి వివేకానంద




– ప్రిన్సిపల్ సునీత

**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ క్లబ్ మరియు వివేకానంద సమితి యర్రవరం ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్య క్రమనికి కళాశాల ప్రిన్సిపల్ డా.డి.సునీత అధ్యక్షత వహించారు. ముందుగా వివేకా నంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రామకృష్ణ పరమహంసకి అత్యంత ప్రియ శిష్యుడిగా వేదాంత తత్వాన్ని ఆధునిక శైలిలో వివరిస్తూ, ఆధ్యాత్మికతను సామాజిక సేవతో మిళితం చేశారన్నారు. 1893లో అమెరికా చికాగోలో జరిగిన ప్రపంచ మతసమ్మేళనంలో సోదర సోదరీమణులారా అంటూ ప్రారంభమైన ఆయన ప్రసంగం ప్రపంచాన్ని ఆకట్టుకొని భారత సంస్కృతి, సహన భావం, సర్వమత సమభావాన్ని అంతర్జాతీయ వేదికపై ప్రతిష్ఠించిందన్నారు. యువతను శక్తివంతం చేసే సందేశాలతో లేచిరండి, మేల్కొనండి, లక్ష్యాన్ని చేరేవరకు ఆగవద్దు అనే నినాదంతో జాతీయ చైతన్యాన్ని రగిలించార న్నారు. 1897లో రామకృష్ణ మిషన్‌ను స్థాపించి, విద్య, ఆరోగ్యం, పేదల సేవ వంటి కార్యక్రమాల ద్వారా మానవ సేవే మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టారని. యువతను దేశ భవిష్యత్తుగా భావించి, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, స్వదేశాభిమానం కలిగిన వ్యక్తిత్వ నిర్మాణానికి పిలుపునిచ్చారని.

స్వామి వివేకానందుల ఆలోచనలు నేటికీ భారత యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. యువత వివేకా నందుని ఆదర్శంగా తీసుకొని జ్ఞాన సముపార్జన చేయాలని కోరారు. ఈ కార్యక్రమములో ఎం. నాగేశ్వర రావు వివేక నంద సమితి అధ్యక్షులు, రాజు , వినయ కళాశాల వైస్ ప్రిన్సిపల్, వేంకటేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.ప్రయాగ మూర్తి ప్రగడ, ఆర్ట్స్ క్లబ్ సభ్యులు డా.శివప్రసాద్, వీర భద్ర రావు, మేరి రొసిలిన అధ్యపకులు వి రామారావు , సురేశ్ , శ్రీ లక్ష్మి, పుష్ప, రాజేశ్, సతీశ్ పెద్ద సంఖ్యలో విద్యార్దిని విద్యార్దులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు విజయ భేరి

– విద్యార్థులను అభినందించిన దేవస్థానం ఈవో త్రినాధరావు



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో శ్రీ సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల మూడో సంవత్సరం విద్యార్థులు 10 మంది హైదరాబాద్ శ్రీ జనార్దనానంద స్వామి సంస్కృతి ట్రస్ట్ వారు నిర్వహించిన స్మార్త విద్వత్ సభలకు హాజరయ్యి 2/01/2026 నుండి 04/01/2026 మూడు రోజులపాటు మౌఖిక పరీక్షల్లో పాల్గొని 10 మంది కూడా ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణులైనవారికి బుధవారం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు చేతుల మీదుగా విజయ పత్రాలను అందజేశారు.

# ఎరువుల దుకాణాలపై వ్యవసాయాధికారుల తనిఖీలు



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాలు అనుసరించి కాకినాడ సామర్లకోట, ఏలేశ్వరం వ్యవసాయ శాఖ అధికారులు ఎరువుల, పురుగు మందుల తనిఖీలు చేపట్టారు. బుధవారం సాయంత్రం స్థానిక శ్రీ వెంకట నారాయణ & కో మరియు వి ఎం నర్సింహం, ఎరువుల స్టాక్, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, ఈ పాస్ లోని ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. అలాగే యూరియా నిల్వలను, కార్డు ద్వారా అమ్మాలని నాణ్యమైన ఎరువులను అమ్మకాలు చేయాలని ఎరువులు దుకాణాల యజమానులకు సూచించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ అధికారులు డి.మాలకొండయ్య, బి.జ్యోతిలతో పాటు అప్పసాని వెంకట రాజేష్‌లు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సంక్రాంతి ముస్తాబుకు శ్రీకారం

– ఎంపీడీవో కుమార్



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** మరో వారం రోజుల్లో సంక్రాంతి పండుగ సమీపిస్తున్నందున గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్యాన్ని పూర్తిస్థాయిలో తొలగించి సంక్రాంతి సొగసులు సంతరించుకునేలా పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు అడ్డతీగల ఎంపీడీవో ఏవివీ కుమార్ తెలిపారు. అందులో భాగంగా అడ్డతీగలలోని సినిమా హాల్ కాలనీ నుండి సీతారామరాజు కాలనీ డొక్కాపాలెం గ్రామ సరిహద్దులో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వరకు రోడ్డుకు ఇరువైపులా చెత్తను తొలగించడంతోపాటు పూర్తిస్థాయి పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఆ పనులను దగ్గరుండి పర్యవేక్షంచడమే కాకుండా పంచాయతీ సిబ్బందికి కార్మికులకు పలు సూచనలు చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న వారు సంక్రాంతికి తమ సొంత గ్రామాలకు వచ్చేనాటికి గ్రామాలు సంక్రాంతి శోభను సంతరించుకుని ప్రజలంతా ఆనందంగా పండుగ జరుపుకోవాలని లక్ష్యంతో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

# ఎ.ఎం.సి భవన నిర్మాణ స్థలం పరిశీలన





**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో స్థానిక డిఎస్‌పి కార్యాలయం వెనుక రెవెన్యూ శాఖ ఎఎంసి భవన నిర్మాణానికి కేటాయించిన 0.29 సెంట్లు స్థలాన్ని ఎ.ఎం.సి. ఛైర్మన్ నూనె మంగాలక్ష్మీ రామారావు, ఎఎంసి డైరెక్టర్ రేలంగి వెంకట్రావు, డిఇ వెంకటేశ్వరరావులతో కలసి పరిశీలించారు. దీనికి సంబంధించి పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రత్యేక చొరవ తీసుకొని ఈ స్థలాన్ని కేటాయించడంతో పాటు తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ సూచనల మేరకు ఎఎంసి ఛైర్మన్ నూనె మంగాలక్ష్మీ రామారావు, ఎఎంసి సెక్రటరీ డి.శ్రీనివాస్ స్థలానికి సంబంధించి మంజూరు పత్రాలను తీసుకోవడం జరిగింది. తాజాగా డిఇ ఆధ్వర్యంలో కొలతలు నిర్వహించి, త్వరలో భవన నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపించడం జరుగుతుందని, ఎఎంసి ఛైర్మన్ నూనె మంగాలక్ష్మీ రామారావు,ఎఎంసి సెక్రటరీ డి.శ్రీనివాస్ తెలిపారు. వీరి వెంట కె.వి.సత్యనారాయణ, షణ్ముఖ్, ముని, సిబ్బంది ఉన్నారు.

# జడ్డంగిలో ఆరుగురిపై బైండోవర్ కేసులు

– ఎస్ఐ చినబాబు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చినబాబు తెలిపారు. గతంలో సారా ఎక్సైజ్ కేసులలో పాల్గొన్న 6గురు వ్యక్తులను గుర్తించి వారిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు.

అనంతరం వారిని రాజవొమ్మంగి ఎమ్ఈఎం కోర్టు ముందు హాజరు పరచడం జరిగిందన్నారు. భవిష్యత్తులో సారా లేదా ఎక్సైజ్ కేసులలో మళ్లీ పట్టుబడితే నిర్ణయించిన బైండోవర్ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని కఠిన హెచ్చరికలు జారీ చేయడం జరిగిందన్నారు. స్టేషన్ పరిధిలో అక్రమ సారా తయారీ, రవాణా మరియు విక్రయాలు జరిపినట్ల యితే ఎంతటి వారిపై నైనా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ చినబాబు హెచ్చరించారు.

# కాగ్నిజెంట్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఆదిత్య విద్యార్థుల సత్తా



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల విద్యార్థులు ప్రముఖ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు కన్సల్టింగ్ సంస్థ కాగ్నిజెంట్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో విశేష ప్రతిభను ప్రదర్శించి 86 మంది డిగ్రీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నాణ్యమైన శిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్న ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలు మరోసారి తమ అకడమిక్ బలాన్ని నిరూపించుకున్నాయని డాక్టర్ నాయుడు పేర్కొన్నారు. ప్రముఖ ఐటీ మరియు కన్సల్టింగ్ సంస్థ ఐన కాగ్నిజెంట్ నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభావంతంగా నిలిచి ఉద్యోగాలు సాధించడం ఎంతో సంతృప్తికరమని తెలిపారు. విద్యార్థుల్లో టెక్నికల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించే విధంగా ఆదిత్య కళాశాలలు అందిస్తున్న శిక్షణే ఈ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. డిగ్రీ సిలబస్‌కు అనుసంధానంగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ, కంపెనీ–బేస్డ్ ట్రైనింగ్ ఇస్తున్నామని అన్నారు. విద్యార్థులను ఉద్యోగావకాశాలకు సంపూర్ణంగా సిద్ధం చేయడమే లక్ష్యంగా కళాశాల యాజమాన్యం నిరంతరంగా కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. కాగ్నిజెంట్ సంస్థ హెచ్.ఆర్. ప్రతినిధి తిరుమురగన్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు ఆకర్షణీయమైన వేతన ప్యాకేజీతో పాటు సంస్థలో వేగంగా ఎదగడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు, ప్రిన్సిపాల్స్. కరుణ, డి. బ్యూలా, వైస్ ప్రిన్సిపాల్ సి.సత్యనారాయణ, ప్లేస్‌మెంట్ కో–ఆర్డినేటర్లు ఎల్. దివాకర రావు, కిషోర్ కుమార్, యు ఎల్ ఎన్ కుమార్, ఎస్ వి ఎల్ నరసింహం అభినందించారు.